సన్మానం



జియాగూడ: ఎమ్మార్పీఎస్ ద్వారా 40 ఏళ్ల సుదీర్ఘ పోరాటం వల్ల తెలంగాణ అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం లభించడం హర్షణీయమని జియాగూడ కాంగ్రెస్ పార్టీ సహా కార్యదర్శి మహేష్‌బాబు మాదిగ అన్నారు. సోమవారం మంద కృష్ణ మాదిగను జియాగూడ కాంగ్రెస్ నాయకులతో కలిసి వెళ్లి సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో సన్మానించారు. అనంతరం మహేష్‌బాబు మాట్లాడుతూ..వర్గీకరణతో మాదిగలకు సంపూర్ణ న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నరేష్, గౌతమ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల అందజేత



దుస్తులు అందజేస్తున్న ఖురేషి, నజీబ్ తదితరులు

గోల్కొండ: ఉజ్వల భవిష్యత్తుకు కఠోర శ్రమ ఎంతో అవసరమని ప్రముఖ సంఘ సేవకుడు సయ్యద్ హామేద్ అలీ ఖురేషి అన్నారు. తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్‌లో సోమవారం గోల్కొండ ఇస్లామిక్ స్కూల్‌లో విద్యార్థులకు దుస్తులు, నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఏకాగ్రతతో చదివితే అద్భుత ఫలితాలు సాధించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్‌నజీబ్, కార్యాలయ ఇన్‌చార్జి మహ్మద్ ఫహాద్ తదితరులున్నారు.

క్రీడారంగ అభివృద్ధికి కృషి



క్రీడాకారులతో రవీందర్‌రెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగ అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తుందని సీఎం కార్యాలయ క్రీడాశాఖ ఓఎస్‌డీ రవీందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీలను సోమవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బాలబాలికలకు అండర్-14, 16, 18, 20 వయస్సు గల వారికి 100, 400 మీటర్ల విభాగంలో జావెలింగ్ త్రో క్రీడల పోటీలను నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం వివిధ విభాగాల్లో గెలుపొందిన క్రీడాకారులను అభినందించారు.

వాటర్‌బోర్డులో సీనియర్ ఆఫీసర్లను నియమించాలి



లక్ష్మీనారాయణ

అఫ్జల్‌గంజ్: మెట్రో వాటర్ బోర్డు డిపార్ట్‌మెంట్‌లో ఖాళీగా ఉన్న 4 సీనియర్ ఆఫీసర్లు, 1 ఆఫీసర్ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని వాటర్‌వర్క్స్ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు జి.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ..కొంత కాలంగా పలు డివిజన్ కార్యాలయాల్లో ఈ ఖాళీలు ఉండడం ద్వారా ప్రతిరోజూ సిబ్బందికి, ఇతర ఉద్యోగులకు ఎన్నో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రత్యేక చొరవ తీసుకొని సీనియర్ ఆఫీసర్, ఆఫీసర్ల పోస్టులను భర్తీ చేసి ఇతర డివిజన్ కార్యాలయాల్లో కూడా ఖాళీ ఉన్న పదవులను భర్తీ చేయాలని లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు.

మురుగు సమస్యకు చెక్



పైప్‌లైన్ పనుల కోసం తవ్వుతున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడ మహంకాళి ఆలయం వద్ద నెలకొన్న మురుగు సమస్యపై ఎట్టకేలకు అధికారులు చర్యలు చేపట్టారు. సమస్య తీవ్రతను వివరిస్తూ 'సాక్షి' దిన పత్రికలో సోమవారం 'మురుగు..పరుగు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఉప్పుగూడ కార్పొరేటర్ ఫహద్ బిన్ అబ్దాద్, మాజీ కార్పొరేటర్ సమద్ బిన్ అబ్దాద్, మజ్లిస్ సీనియర్ నాయకుడు వర్కల నాగరాజు బడ్జెట్‌తో సంబంధం లేకుండా పనులను ప్రారంభించారు.

షబ్-ఏ-ఖదర్‌కు మసీదులు ముస్తాబు

- 27న షబ్-ఏ-ఖదర్ ప్రార్థనలు
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన మసీదుల నిర్వాహకులు



ముస్తాబైన మెహిదీపట్నం మసీదు

గోల్కొండ: షబ్ ఏ ఖదర్‌కు కార్వాన్ నియోజకవర్గంలోని మసీదులు ముస్తాబయ్యాయి. రంజాన్ మాసం 26వ రోజు ఖురాన్ భూలోకానికి బహుమతిగా వచ్చింది అన్నది ముస్లింల ప్రగాఢ నమ్మకం. అందువల్లే రంజాన్ నెల 26వ రోజు రాత్రి(ఈ నెల 27న) ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. ఉపవాస దీక్ష విరమణ అనంతరం షబ్-ఏ-ఖదర్ ప్రార్థనలకు మసీదుల్లో అన్ని సిద్ధం చేసుకుంటారు. తరావీ ప్రార్థనల అనంతరం మసీదుల్లో ఖురాన్ గ్రంథం ప్రవక్త మహ్మద్ జీవితం, బోధనలపై మత గురువులు ప్రసంగిస్తారు. అనంతరం తహజ్జుద్ నమాజ్ ఉంటుంది. వయస్సుతో సంబంధం లేకుండా అన్ని వయస్సుల వారు ఈ నమాజ్‌లను తప్పనిసరిగా చేయాలి. మహిళల కోసం మసీదుల్లో విడిగా ఏర్పాట్లు ఉంటాయి. ఈ ప్రార్థనలు తెల్లవారు జాము వరకు కొనసాగుతాయి. తదుపరి రోజు ఉపవాస దీక్ష కోసం సహేరి చేసిన తరువాత ఈ ప్రార్థనలు ముగుస్తాయి. మెహిదీపట్నం చౌరస్తా మసీదు, మురాద్‌నగర్‌లోని చోటీ మసీదు, టోలిచౌకీలోని బిలాల్ జామా మసీదు, గోల్కొండ కుతుబ్ షాహీ జామా మసీదులలో షబ్-ఏ-ఖదర్ ప్రార్థనల కోసం ప్రత్యేక ఏర్పాటు చేశారు.

షబ్-ఏ-ఖదర్ రోజు ప్రార్థనలకు ఎంతో ప్రాముఖ్యం..

షబ్-ఏ-ఖదర్ రోజు ప్రార్థనలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఈరోజు రాత్రి ప్రార్థనలు వెయ్యి నెలల ప్రార్థనలతో సమానం అని ఖురాన్‌లో ఉంది. ఈరోజు రాత్రి ప్రార్థనలు చేసి దేవుడితో పాపాలను క్షమించాలని కోరే వారికి దేవుడు పాపవిముక్తులను చేస్తాడు. ఈ విషయం ఇస్లాం గ్రంథంలో స్పష్టంగా ఉండగా ఈ విషయాన్ని ప్రవక్త మహ్మద్ సైతం ఎన్నోమార్లు తన ప్రవచనాలలో స్పష్టం చేశారు. తహజ్జుద్ ప్రార్థనల అనంతరం నఫీల్ ప్రార్థనలు చేస్తే అటువంటి వారి ప్రార్థనలకు దేవుడు ఆమోదిస్తాడు. అటువంటి వారి జీవితాల్లో విజయాలే వస్తాయి. ప్రవక్త మహ్మద్ జీవితంలో షేబ్ ఏ ఖదర్ రోజున నియమం తప్పకుండా ప్రార్థనలు చేసే వారు అంతేకాకుండా షబ్ ఏ ఖదర్ పవిత్ర రాత్రి అని ఈ పవిత్ర రాత్రిలో ప్రార్థనలు చేసే వారు దైవకృపకు పాత్రులవుతారని మరణానంతరం అటువంటి వారికి స్వర్గలోక ప్రాప్తి కలుగుతుందని మహ్మద్ ప్రవక్త బోధించేవారు.

యువత భక్తి మార్గంలో పయనించాలి..



షబ్ ఏ ఖదర్ రోజున చేసే ప్రార్థనలకు అల్లా ఆమోదిస్తాడు. యువకులు దైవభక్తి పెంచుకొని సన్మార్గం వైపు పయనించడానికి ఈరోజు ప్రార్థనలు వారికి దోహదపడతాయి. షబ్ ఏ ఖదర్ రోజున నమాజ్ చేయడానికి ఎవరికి కూడా ఎటువంటి సడలింపులు ఉండవు. అనారోగ్యంతో ఉన్న వారు సైతం ఈ ప్రార్థనలు తప్పనిసరిగా చేయాలి.

– మౌలానా మహ్మద్ రేహాన్

మహిళలు ధైర్యంగా అన్యాయాలను ఎదుర్కోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ అనురాధ మెడోజు

చార్మినార్: ప్రభుత్వ సిటీ కళాశాల మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాల భాస్కర్ నేతృత్వంలో సోమవారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సదస్సులో 'కంటికి కనిపించని సంఘర్షణ'అనే అంశంపై చిత్ర ప్రదర్శన, బృంద చర్చ జరిగింది. ముఖ్యఅతిథిగా ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చెందిన ఆరోగ్య, కుటుంబ సంక్షేమ విభాగం సీనియర్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ అనురాధ మెడోజు హాజరై మాట్లాడారు. మహిళలు ప్రలోభాలకు లోను కారాదని.. తమకు జరుగుతున్న అన్యాయాలను ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. మహిళా సాధికారత విభాగం కన్వీనర్ డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ.. స్త్రీలు పైకి రావడం అంటే పురుషులను తక్కువ చేయడం కాదని అది మానవత్వానికి పునాది అని అన్నారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ నీరజ, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ ఏలూరి యాదయ్య, డాక్టర్ శంకర్, డాక్టర్ భాస్కర్, జీఆర్సీ సెక్యూరిటీ ఆర్కిటెక్ట్ చంద్రకాంత్ అక్క రాజు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ సెర్మని



గ్రాడ్యుయేషన్ సెర్మనిలో రైట్ రేవ్ ప్రొఫెసర్ డాక్టర్ ర్యూబెన్ మార్క్, డాక్టర్ కె.ప్రెసిల్లా, సత్యానందం

అబిడ్స్: విద్యారంగ వ్యాప్తికి సెయింట్ జార్జెస్ విద్యా సంస్థలు ప్రత్యేక కృషి చేస్తున్నాయని సీఎస్ఐ మెదక్ డయోసిస్ బిషప్ రైట్ రేవ్ ప్రొఫెసర్ డాక్టర్ ర్యూబెన్ మార్క్ పేర్కొన్నారు. విద్యార్థులకు చిన్నపటి నుంచే అన్ని రంగాల్లో రాణించే విధంగా తమ విద్యాసంస్థలు తీర్చిదిద్దుతున్నాయన్నారు. సోమవారం అబిడ్స్‌లోని సెయింట్ జార్జెస్ గ్రామర్ ప్రిప్రరేటరి స్కూల్‌లో జరిగిన గ్రాడ్యుయేషన్ సెర్మని వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా తమ విద్యాలయాలు విద్యార్థుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచే విధంగా ప్రత్యేక కృషి చేస్తున్నామన్నారు. ఈ వేడుకల్లో రేవ్ డాక్టర్ కె.ప్రెసియుల్లా, ర్యూయెబన్ మార్క్, హెచ్ఎం జె.మార్థానిస్సి డేనియల్, స్పెషల్ ఆఫీసర్ ఆర్.సత్యానందం, క్యాప్టెన్‌లు, హౌస్‌క్యాప్టెన్‌లు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ వెంకన్న

చార్మినార్: ప్రజావాణిలో అందిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ టీ. వెంకన్న తెలిపారు. జోనల్ కమిషనర్ వెంకన్న ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం జరిగింది. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో అక్రమ నిర్మాణం పై 2, ఇంజినీరింగ్ సమస్యపై ఒక్క ఫిర్యాదు అందింది. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ వెంకన్న మాట్లాడుతూ..ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అందిన ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ శంకర్ సింగ్, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్, ఏఎంసీ రాజారావు, టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్ మహమ్మద్ అబ్దుల్ మాజీద్, ఎలక్ట్రికల్ ఈఈ రామారావు, బిల్ కలెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో స్వచ్ఛ భారత్



స్వచ్ఛ భారత్‌లో డాక్టర్ పి.వి.శ్రీనివాసరావు తదితరులు

గోల్కొండ: కేంద్ర ప్రభుత్వ పథకం కాయా కల్ప్‌లో భాగంగా సోమవారం గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.వి.శ్రీనివాసరావు తోటి వైద్యులు, నర్సింగ్ సిబ్బందితో కలిసి ఆసుపత్రిలో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..తమ ఆసుపత్రి గత సంవత్సరం ప్రతిష్టాత్మకమైన కాయా కల్ప్ అవార్డుకు ఎంపికయ్యిందన్నారు. ఆసుపత్రి ఔట్ పేషంట్, ఇన్ పేషంట్ విభాగాలు, ఆపరేషన్ థియేటర్, లేబర్ రూమ్ తదితర విభాగాలను పలుమార్లు పరిశీలించి అధికారులు కాయా కల్ప్ అవార్డు ప్రకటించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ రాకేష్, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయ పాఠశాలల సేవలు ఎనలేనివి



ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యావేత్తలు

విజయనగర్‌కాలనీ: జవహర్ నవోదయ పాఠశాలల పూర్వ విద్యార్థులు మాసబ్‌ట్యాంక్‌లోని జవహర్ లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ ప్రాంగణంలోని ఆడిటోరియం హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమన్వయకర్తలు, విద్యావేత్తలు సుష్మా, సుజాత, పద్మజ, వెన్నెల, సీహెచ్.మురళి మాట్లాడుతూ..లింగవివక్ష చూపకుండా బాలబాలికలకు ఉన్నత చదువులు చెప్పించాలని సూచించారు. నవోదయ పాఠశాలల సేవలు ఎనలేనివన్నారు. దేశానికి ఉపయోగపడే భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో తమ పాఠశాలలు ముందున్నాయని కొనియాడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో నవోదయ పాఠశాలల పూర్వ విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

హోలీ మిలన్ నిర్వహించడం హర్షణీయం



మహేష్కర్ కాంతిలాల్‌ను సన్మానిస్తున్న ఉమా మహేందర్ తదితరులు

జియాగూడ: ప్రతి యేటా హోలీ మిలన్ నిర్వహించడం హర్షణీయమని బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు ఉమా మహేందర్ అన్నారు. సోమవారం సంజయ్‌నగర్‌లోని సమాజ్ భవన్‌లో సూర్యవంశీ సంత్ రవిదాస్ మోచి సమాజ్ సేవా సంఘం ఆధ్వర్యంలో హోలీ మిలన్ కార్యక్రమం ఏర్పాటు కాగా సమాజ్ గౌరవ అధ్యక్షుడు, చైర్మన్ మహేష్కర్ కాంతిలాల్, గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఉమా మహేందర్‌ను సమాజ్ ప్రతినిధులు సన్మానించి సత్కరించారు. గోల్కొండ జిల్లా కో కన్వీనర్ శివకుమార్‌యాదవ్, జియాగూడ అధ్యక్షుడు జగదీష్‌యాదవ్, సీనియర్ నాయకులు రాజేందర్ డేగస్, ఆకుల సుదర్శన్, జిల్లెల వెంకటేష్ యాదవ్, సమాజ్ అధ్యక్షుడు, మనోహర్‌లాల్ పూర్వె, వైస్ ప్రెసిడెంట్ వినోద్ దయాల్ పాల్గొన్నారు.

అలరించిన 'లాలిత్యం'

సుల్తాన్‌బజార్: హైదరాబాద్ సిస్టర్స్‌లో ఒకరైన భాస్కర్ లలితకు నివాళిగా లాలిత్యం కార్యక్రమం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో ఆత్మీయంగా జరిగింది. వయోలిన్‌తో పాకొలంక సాయి, మృదంగంతో కే సాయి, కుమారు వాయిద్య సహకారం అందించారు. ఆమె శిష్యులు హేమావతి, పేరి పద్మ, శారదా రామకృష్ణారావు, శారద జన స్వామి, పద్మజా చిలుకలపూడి, ప్రసన్న సుసర్ల గురువు లలితకు సంగీత పుష్పాంజలి సమర్పించారు.



గురువు లలితకు నివాళిగా లాలిత్యం కార్యక్రమంలో పుష్పాంజలి సమర్పిస్తున్న శిష్యులు

శ్రీరామ నవమి పాల్కీ శోభాయాత్రకు అనుమతివ్వండి



అబిడ్స్: శ్రీరామ నవమి పాల్కీ శోభాయాత్రకు అనుమతిని కోరుతూ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌ను నిర్వాహకులు డాక్టర్ భగవంతరావు, ఆనంద్‌సింగ్, పప్పుమాత్రే, గోవింద్‌రాఠి లేఖను అందజేశారు. సోమవారం వారంతా కమిషనర్‌ను కలిసి పాల్కీ శోభాయాత్ర జోరుగా చేపట్టేందుకు పోలీస్ శాఖ తరఫున ఏర్పాట్లు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మెట్టు వైకుంఠం, కరోడిమాల్, ప్రశాంత్ సింగ్, సౌరబ్ సింగ్, విశ్వేష్‌సింగ్, పప్పుమాత్రే తదితరులు పాల్గొన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ఐదుగురికి జైలు

చార్మినార్: తాగి వాహనాన్ని నడుపుతూ పట్టుబడితే జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా తప్పదని చార్మినార్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సుంకరి వీర శేఖర్ అన్నారు. సిటీ కాలేజ్ చౌరస్తా వద్ద నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీలలో ఐదు మంది వాహనదారులు మద్యం సేవించి పట్టుబడ్డారన్నారు. వీరిని న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా జరిమానాతో పాటు జైలు శిక్ష విధించారన్నారు. కేసులో 5 మందిని జైలుకు పంపారు. సైదాబాద్‌కు చెందిన వెంకటేష్, గచ్చిబౌలికి చెందిన సుభాష్, చెలాపురా ప్రాంతానికి చెందిన మాలిక్, లాల్ శర్మ, ఇసామియా బజార్‌కు చెందిన గౌస్ తదితరులను 5వ జేఎంఎఫ్సీ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారమన్నారు. ఇందులో వెంకటేష్‌కు ఒకరోజు, సుభాష్‌కు 3 రోజులు, గౌస్, లాల్ శర్మ, మాలిక్‌కు 2 రోజుల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి వరుసగా రూ. 3300 జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

నాంపల్లి: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన నాంపల్లి రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..సుమారు 50 ఏళ్ల వయస్సు కలిగిన ఓ గుర్తు తెలియని వ్యక్తి సోమవారం ప్రకృతి చికిత్సాలయం-ఫతేనగర్ రైల్వే స్టేషన్ల మధ్యలో రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే దుర్మరణ చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి భద్రపరిచారు. మృతుడి ఒంటిపై లేత నీలం రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించినట్లు పోలీసులు తెలిపారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



గోల్కొండ: నిరుపేదలు కూడా పండగలను సంతోషంగా జరుపుకోవాలన్నదే తమ ఆశయమని జగదాంబిక మహంకాళి వృత్తిపని వారి సంఘం మాజీ అధ్యక్షుడు బి.సాయిబాబాచారి అన్నారు. సోమవారం ఆయన గోల్కొండ నయాకీలాలో నిరుపేదలు, వితంతువులు, దివ్యాంగులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..స్థానికంగా బస్తీ పెద్దల సలహాలు, సూచనలతో మూడు దశాబ్దాలుగా తాను రంజాన్ మాసంలో నిరుపేదలకు నిత్యావసర సరుకులను అందజేస్తున్నానన్నారు. మహంకాళి ఆలయ పూజారి సురేష్‌చారి, హుస్సేన్ బిన్ ఈసా తదితరులున్నారు.

నాకు పోలీసు రక్షణ అవసరం లేదు

శ్రీరామ నవమి వేడుకల నేపథ్యంలో ఎమ్మెల్యే రాజాసింగ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజాసింగ్

సుల్తాన్‌బజార్: శ్రీరామ నవమి సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అధికారులు చొరవ చూపాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. శ్రీరాముని శోభాయాత్ర జరిగే ఆకాషపురి హనుమాన్ మందిర్ నుంచి హనుమాన్ వ్యాయామశాల వరకు రోడ్లు అన్ని గుంతలమయంగా మారాయన్నారు. ఆ ప్యాచ్‌వర్క్‌లను వెంటనే పూర్తి చేయాలని ఆయన కోరారు. శోభాయాత్ర జరిగే ప్రాంతాల్లో స్వాగత వేదికలు ఏర్పాటు చేసుకునేందుకు అధికారులు సహకరించాలని కోరారు. స్వాగత వేదికలకు అధికారులు ఎలాంటి అభ్యంతరాలు తెలపవద్దని ఆయన అన్నారు. డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ ఈ ర్యాలీకి సమస్యలు రాకుండా చూసుకోవాలన్నారు. ఆకాష్‌పురి హనుమాన్ మందిర్ నుంచి పురానాపూల్, బేగంబజార్ పోలీసుల టార్చర్ ఉంటుందన్నారు. నాకు ఎలాంటి పోలీసు రక్షణ అవసరం లేదు, కార్యకర్తలే నాకు రక్షణ కవచంలా చూసుకుంటారని రాజాసింగ్ వ్యాఖ్యలు చేశారు. ఏప్రిల్ 6న నిర్వహించే శ్రీరామ నవమి శోభాయాత్ర ఎంతో ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు.



మెహదీపట్నం సరోజినీ దేవి హాస్పిటల్ ఎదురుగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం అడిషనల్ సీపీ జోయేల్ డేవిస్ ట్రాఫిక్ ఆదేశాల మేరకు సోమవారం స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ ధనలక్ష్మి, ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ గౌడ్, ట్రాఫిక్ ఏటీసీ సెల్ కోటేశ్వరరావు.
– సాక్షి, సిటీబ్యూరో

నిజాం కళాశాల విద్యార్థుల ఆందోళన



గన్‌ఫౌండ్రీ: మూడు నెలలుగా యూజీ 5 సెమిస్టర్ పరీక్షా ఫలితాలను విడుదల చేయకపోవడంపై నిజాం కళాశాల విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే పరీక్షా ఫలితాలను విడుదల చేయాలని కోరుతూ సోమవారం నిజాం కళాశాల విద్యార్థులు ప్రిన్సిపాల్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ..ఏప్రిల్ నెలలో పీజీ ఎంట్రన్స్ ఉంటుందని ఇప్పటి వరకు యూజీ ఫలితాలు విడుదల చేయకపోతే ఎలా అని ప్రశ్నించారు. పరీక్షా ఫలితాలను విడుదల చేయకపోతే పై చదువులకు ఇబ్బంది అవుతుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఫలితాలను విడుదల చేయాలని లేకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ విద్యార్థుల నినాదాలతో ప్రిన్సిపాల్ కార్యాలయంలో దద్దరిల్లిపోయింది.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

గోల్కొండ: నానల్‌నగర్ పద్మనాభనగర్‌లోని శ్రీగణపతి సేవా సమితి దేవాలయంలో సోమవారం 22వ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉదయం చండీహోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అదే విధంగా సాయంత్రం శివ పార్వతుల కల్యాణ మహోత్సవం కనులపండువగా జరిగింది. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు వీఎస్ నాయుడు మాట్లాడుతూ.. ప్రతి ఏటా బ్రహ్మోత్సవాలను అందరి సహకారంతో కనులపండుగగా నిర్వహిస్తున్నామని అన్నారు. ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. సెక్రటరీ ధర్మారావు, కోశాధికారి సత్యనారాయణమూర్తి, కమిటీ సభ్యులు నిక్కు జనార్దనారావు, రామకృష్ణా, నర్సింహరావు, శివశంకర్, మురళీధర్‌రావు, మహేష్, భరత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పటిష్టతకు చార్మినార్‌లో పర్యటించాలి



దాసోజు శ్రావణ్‌తో సమావేశమైన సలావుద్దీన్ లోది

చార్మినార్: బీఆర్ఎస్ పార్టీని మరింత పటిష్టం చేయడానికి చార్మినార్‌లో పర్యటించాలని కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్‌ను కోరినట్లు బీఆర్ఎస్ పార్టీ చార్మినార్ శాసనసభ నియోజకవర్గం ఇన్‌చార్జి మహమ్మద్ సలావుద్దీన్ లోది తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయనను కలిసి పాతబస్తీలో పార్టీ పరిస్థితిని వివరించామన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీ ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తుందనే విషయాన్ని ఆయన దృష్టికి తెచ్చినట్లు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో మహమ్మద్ సైఫుద్దీన్ లోది తదితరులు ఉన్నారు.